సంక్షేమ పాలనతో రాష్ట్రంలో స్వర్ణయుగం

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- 27వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం

తెనాలిఅర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగుతోందని, దీనిని స్వర్ణ యుగంగా చెప్పవచ్చని తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అభిప్రాయపడ్డారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 27వ వార్డు పాండురంగ పేట సిద్ధార్థ స్కూల్ నుంచి శనివారం ఉదయం ఆయన ప్రారంభించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ రావి ప్రశాంతి, 27వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు రావి రాంబాబు, నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్లిన ఎమ్మెల్యే శివకుమార్ ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని ప్రజలకు తెలియజేసి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. కులాలు, మతాలు, ప్రాంతాలు, రాజకీయ పార్టీలు చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. అగ్రి గోల్డ్ సంస్థ పేద ప్రజలను మోసం చేస్తే.. గత టీడీపీ ప్రభుత్వం బాధితులకు న్యాయం చేయడంలో వెనుకడుగు వేసిందని ఆరోపించారు. సీఎం జగన్ హామీ మేరకు రూ.20వేల లోపు డిపాజిట్ దారులకు ప్రభుత్వమే నగదు చెల్లించిందని గుర్తుచేశారు.



సంక్షేమ పథకాలను మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

పేద ప్రజలు ఆర్థికంగా నష్టపోకూడదనే ఉద్దేశంతో సీఎం ఈ నిర్ణయం తీసుకున్నారని వివరించారు. పేదలపై ప్రభుత్వానికి ఉన్న ప్రేమకు ఇది నిదర్శనమన్నారు. 27వ వార్డులో అగ్రిగోల్డ్ బాధితులు 106 మంది ఉన్నారని, వారికి సుమారు రూ.8 లక్షలు చెల్లించడం జరిగిందన్నారు. మరో ఇద్దరికి నగదు అందలేదని తెలియజేశారని, వారి గ్రీవెన్స్‌ను కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్, కౌన్సిలర్లు షేక్ దుబాయ్ బాబు, యాతాటి అనిల్, షేక్ ఇస్మాయేలు, కో–ఆప్షన్ సభ్యుడు పెద్చింగ్ సుభాని, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, 27 వార్డు నాయకులు నల్లగడ్డ రవిచంద్ర, రావూరి నరేష్ కుమార్, కన్నె నరేష్, బండ్లమూడి నాని, సాయి, శ్రీకాంత్, నాగ గోపి, కోటి, సతీష్ రెడ్డి, బొంతగాని తిరుపతయ్య, మల్లిబోయిన చంద్రశేఖర్, కోగంటి మల్లిబాబు, మాదల భాను ప్రసాద్, కోగంటి ఆషు, రావి శ్రీనివాసరావు, గండ్ల మోహనరావు, కట్ట బుల్లయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మంత్రిగా ఎదిగిన సాధారణ రైతు

- మాజీ మంత్రి అన్నాబత్తుని సత్యనారాయణ
- రేపు వర్ధంతి కార్యక్రమాలు

తెనాలి: చైతన్య వంతమైన తెనాలిలో విద్య, అనుభవం లేకుండా రాజకీయాల్లో రాణించడం అసాధ్యమనే చెప్పాలి. ఇవేమీ లేకపోయినా, సంకల్ప బలం, ప్రజా సేవలో నిబద్ధతతో ప్రజల మనసు గెలిచి, రాష్ట్ర మంత్రి ఎదిగిన రైతు బిడ్డ.. మాజీ మంత్రి అన్నాబత్తుని సత్యనారాయణ. రైతుగా, పశు పోషకుడిగా ఉన్న ఆయన.. రైస్ మిల్లరుగా వ్యాపారంలోకి అడుగు పెట్టి.. కౌన్సిలరుగా రాజకీయ రంగ ప్రవేశం చేశారు. అనంతరం ఎమ్మెల్యేగా, మంత్రిగా ఎదిగిన సత్యనారాయణ ప్రగతి నేటి తరానికి స్ఫూర్తిదాయకం.

పట్టణ అయితానగర్‌లోని రైతు కుటుంబంలో 1936లో జన్మించిన అన్నాబత్తుని సత్యనారాయణ పెద్దగా చదువుకోలేదు. వ్యవసాయం, పశుపోషణతో పాటు ఆదాయం కోసం రైస్‌మిల్లు వ్యాపారంలో ఉండేవారు. తన నాయకత్వ పటిమతో రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎదిగారు. అదే క్రమంలో కౌన్సిలరుగా గెలిచి, పరోక్ష పద్ధతిలో మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ఆయన తీసుకున్న చర్యలు నేటికీ తెనాలి ప్రజలు చెప్పుకుంటారు. ఎన్ని ఒత్తిడులు వచ్చినా.. ఆక్రమణల తొలగింపుతో నిరసనలు ఎదురైనా మొండిగా ముందుకెళ్లారు. తర్వాతి కాలంలో ఆ చర్యలను అందరూ హర్షించారు. పండ్ల మార్కెట్, పుర వేదిక ఆయన హయాంలో ఏర్పాటు చేసినవే. అనంతరం 1983, 1985లో రెండు సార్లు తెనాలి శాసన సభ్యుడిగా విజయం సాధించారు.



అన్నాబత్తుని సత్యనారాయణ (ఫైల్)

రెండో పర్యాయం రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి పదవిని చేపట్టారు. అప్పట్లోనే తెనాలి సరిహద్దుల్లో సోమసుందర పాలెం పంచాయతీ పరిధిలో ఆటో నగర్ ఏర్పాటుకు 56 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ప్రస్తుతం అది ఆటోనగర్ వ్యాపార కూడలిగా మారింది.

గ్రామీణ విద్యార్థులకు ఉపాధినిచ్చే కోర్సులను అందుబాటులోకి తేవాలన్న సంకల్పంతో.. ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీని ప్రారంభించారు సత్యనారాయణ. ఆయన తనయుడు, ప్రస్తుత తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నిర్వహణలో శాఖోపశాఖలుగా కళాశాల విస్తరించింది. కొత్తగా ఫార్మసీ, ఇంజినీరింగ్ కాలేజీలు నడుస్తున్నాయి. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలోని అత్యుత్తమ విద్యా సంస్థగా, క్యాంపస్ ఎంపికల్లో మేటిగా గుర్తింపును పొందడం విశేషం. విద్యార్హతలు లేకున్నా ఆత్మవిశ్వాసం, పట్టుదల మెండుగా ఉంటే విజయ సాధనకు ఏదీ అవరోధం కాదని ఆయన నిరూపించారు. రాజకీయవేత్తగా తనదైన ముద్ర వేశారు. పార్టీల కతీతంగా సత్యనారాయణ అభిమానులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన కార్యకర్తలు వందలాదిగా ఏటా ఆయన వర్ధంతి జనవరి 9న ఘనంగా నివాళులర్పిస్తుంటారు. ఆయన వారసుడిగా, స్థానిక శాసన సభ్యుడిగానూ అన్నాబత్తుని శివకుమార్ నేతృత్వంలో రేపు సత్యనారాయణ వర్ధంతి కార్యక్రమాలు జరగనున్నాయి.

క్లుప్తంగా

రూరల్ సీఐగా శ్రీనివాసరెడ్డి బాధ్యతలు



తెనాలిరూరల్: తెనాలి రూరల్ సీఐగా కడప శ్రీనివాసరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. డీఎస్పీ కార్యాలయం వద్ద శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 2004 బ్యాచ్‌కు చెందిన ఆయన 2014 వరకు ఆర్మ్‌డ్ రిజర్వ్‌లో ఎస్‌ఐగా చేశారు. అనంతరం సివిల్ పోలీసు విభాగంలో పల్నాడు జిల్లా రొంపిచర్లలో ప్రొబేషన్ ఎస్‌ఐగా తొమ్మిది నెలలు చేశారు. అనంతరం బాపట్ల టౌన్, కొల్లిపరలో పనిచేసి, సీఐగా ఉద్యోగోన్నతి పొందారు. బాపట్ల రూరల్ సీఐగా మూడేళ్ల పాటు పని చేసిన ఆయన.. తెనాలి రూరల్ సర్కిల్‌కు బదిలీపై వచ్చారు. ఇక్కడ సీఐగా పని చేస్తున్న ఎం.సుబ్రహ్మణ్యంను వీఆర్‌కు పంపారు.

నాదస్వర విద్వాంసురాలు మస్తాన్‌బీకి సన్మానం



తెనాలిఅర్బన్: ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం పెన్షనర్స్ హాల్‌లో 'మహా నటుడు ఎన్టీఆర్' అనే అంశంపై చర్చా కార్యక్రమం జరిగింది. ధూళిపాళ్ల గోపాలకృష్ణ, చిన్నం రవీంద్రలు సభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా వారితో పాటు ప్రముఖ నాదస్వర విద్వాంసురాలు షేక్ మస్తాన్‌బీని సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, పినపాటి రవీంద్ర, ఫణీదపు దుర్గాప్రసాద్, ముప్పనేని రాఘవరావు, దేవిశెట్టి భాస్కర్, వి.ప్రసాద్, మైనేని నాగ భూషణం, వేములపల్లి మల్లికార్జునరావు, నాగ భ్రమరాంభ, మనీష, సూరపనేని అనురాధ, గడ్డిపాటి సీతారత్నం, మన్నే శ్రీనివాసరావు, టీవీఎస్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్ టవర్ ప్రారంభం

తెనాలిరూరల్: పట్టణంలోని చినరావూరులో బీఎస్‌ఎన్‌ఎల్ 2జీ, 3జీ, 4జీ టవర్‌ను శనివారం ప్రారంభించినట్లు బీఎస్‌ఎన్‌ఎల్ జిల్లా జనరల్ మేనేజర్ ఎస్. శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చినరావూరు, పరిసర ప్రాంత ప్రజలు సేవలను వినియోగించుకోవాలని కోరారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

తెనాలిరూరల్: వివాహిత అదృశ్యంపై శనివారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని పాండురంగ పేటలో టింబర్ డిపోలో పని చేసే వెంకటేశ్వరరావు, నందిని దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. ఆరేళ్ల కుమారుడు, నాలుగేళ్ల కుమార్తె ఉంది. చిన్న చిన్న పనులకు వెళుతుండే నందిని ఈ నెల 5న ఇద్దరు పిల్లలను తీసుకుని ఇంటి నుంచి వెళ్లి.. తిరిగి రాలేదు. ఎక్కడ వెతికినా..ఫలితం లేకపోవడంతో భర్త వెంకటేశ్వరరావు పోలీసులను ఆశ్రయించాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు త్రీ టౌన్ ఎస్‌ఐ ఎం.విజకుమార్ తెలిపారు.

జడ్పీ మాజీ చైర్‌పర్సన్ ఇందిరకు నివాళి



తెనాలిఅర్బన్: జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ దొడ్డపనేని ఇందిర జయంతిని కొత్తపేటలోని మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గతేడాది 10వ తరగతిలో మంచి మార్కులు సాధించిన 10 మంది విద్యార్థులకు రూ.1000ల చొప్పున నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ, స్కూల్ హెచ్‌ఎం రాజ్యలక్ష్మి, స్వర్ణలత, చెరుకూరి వెంకటరత్నం, గుమ్మడి రమేష్, శ్రీనివాసరావు, బెన్ను, నాగ బసవేశ్వరరావు, సాంబశివరావు, సుభాని తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం సిద్ధరామయ్యకు విగ్రహావిష్కరణ ఆహ్వానం

గుంటూరు మెడికల్: గుంటూరులో ఫిబ్రవరిలో జరగనున్న బీపీ మండల్ కాంస్య విగ్రహావిష్కరణ మహోత్సవానికి కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత సిద్ధరామయ్యకు ఆహ్వానం అందజేసినట్లు మండల్ విగ్రహ నిర్మాణ కమిటీ కో– కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వెనుకబడిన తరగతుల ఆత్మగౌరవ ప్రతీక బీపీ మండల్ విగ్రహాన్ని గుంటూరులో నెలకొల్పడం హర్షనీయమని సిద్ధరామయ్య పేర్కొన్నట్లు వెల్లడించారు. సిద్ధరామయ్యను కలసిన వారిలో గొల్ల కేశవులు, బడి సుధా యాదవ్, డాక్టర్ కృష్ణకుమార్ ఉన్నారని తెలిపారు.

క్రీడాకారిణికి కలెక్టర్ అభినందన

నగరంపాలెం: వైఎస్సార్ కడప జిల్లాలోని రైల్వే కోడూరులో గత నెల 26, 27 తేదీల్లో కడప జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యాన 66వ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించారు. అండర్ –19 కేటగిరిలో 59–63 కిలోల విభాగాన మైస్పేస్ తైక్వాండో అకాడమీ క్రీడాకారిణి రాచమల్లు కళాజ్యోత్స్న రాష్ట్రస్థాయిలో బంగారు పతకం సాధించింది. దీంతో ఆమె జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ తైక్వాండో పోటీలకు ఎంపికైంది. ఈ నేపథ్యంలో కళాజ్యోత్స్నను కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, స్టెప్ సీఈఓ వెంకటనారాయణ శనివారం కలెక్టరేట్‌లో సత్కరించారు. కార్యక్రమంలో ఇంటర్ బోర్డు సమన్వయకర్త



కళాజ్యోత్స్నను అభినందిస్తున్న కలెక్టర్

సునీత, ఎస్ఆర్ కళాశాల జోనల్ ఇన్‌చార్జి ఎం.పూర్ణచంద్రరావు, అకాడమీ డీన్ అప్పిరెడ్డి, ప్రధాన ఆచార్యులు నిమ్మగడ్డ సురేష్ పాల్గొన్నారు.

14న శ్రీ గోదాదేవి, రంగనాయకుల కల్యాణం

పాత గుంటూరు: లాలాపేటలోని శ్రీ పద్మావతి ఆండాళ్ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో 14న భోగి పండుగ సందర్భంగా ఉదయం 10 గంటలకు 108 మంది కన్యలతో శ్రీ గోదాదేవి రంగనాయకులస్వామికి కూడరై పూజ, శ్రీ గోదాదేవి రంగనాయకుల స్వామి తిరు కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి డి. శ్రీనివాసరావు తెలిపారు. ఆ రోజు పూజల్లో పాల్గొనే కన్యలకు అందించే 108 పాయసం గిన్నెలను సామాజిక సేవకుడు ఆకుల ఏడుకొండలు శనివారం ఆలయానికి అందించారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ జయప్రకాశ్‌రెడ్డి, ధరకర్తల మం



కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు

డలి సభ్యులు విశాలాక్షి, వెంకట జ్యోతి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని శ్రీ పద్మావతి కల్యాణ మండపం వేదికపై భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం హనుమాన్ చాలీసా అష్టోత్తర శత పర్యాయాల పారాయణ కార్యక్రమాన్ని కోగంటి వెంకట శ్రీరంగనాయకి అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య మాట్లాడుతూ హనుమాన్ చాలీసా పారాయణ సర్వ కార్యజయం, ధైర్యం కలిగిస్తాయని తెలిపారు. విశేషంగా పాల్గొన్న భక్తులకు మహా హారతి అనంతరం తీర్థ, అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఉపాధ్యక్షుడు లంక విజయబాబు, కార్య



కార్యక్రమంలో పాల్గొన్న మస్తానయ్య, భక్తులు

దర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సభ్యుడు పుట్టగుంట ప్రభాకర్ పాల్గొన్నారు. కార్యక్రమాన్ని పరిషత్ వ్యవస్థాపకుడు బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు పర్యవేక్షించారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం

పాత గుంటూరు: సమాచార హక్కు చట్టంపై అధికారులు, సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు సమగ్ర అవగాహన కలిగి ఉండాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పెద్ది రోజా సూచించారు. రాజాగారితోటలోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శనివారం నగరపాలక సంస్థ మినిస్టీరియల్ సిబ్బంది, సచివాలయ అడ్మిన్, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ కార్యదర్శులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంపై ప్రతి ప్రభుత్వ ఉద్యోగి సమగ్ర అవగాహన కలిగి ఉండి నిర్దేశిత సమయంలో, లభ్యతలో ఉన్న సమాచారాన్ని అందించాలని చెప్పారు. దరఖాస్తుల పరిష్కారం, అప్పీల్ సమయం, అథారిటీ, జరిమానాలు, సంబంధిత రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని తెలిపారు. ప్రతి విభాగంలో సమాచార హక్కు దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేకంగా అధికారుల్ని నియమించినట్లు చెప్పారు. అనంతరం ఎన్‌జీవో అసోసియేషన్ నగర కార్యదర్శి ఎం.ఎస్. మూర్తి సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్గించారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ భాస్కర్, సిటీ ప్లానర్ మూర్తి, డెప్యూటీ సిటీప్లానర్ కోటయ్య, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నెహ్రూనగర్: గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పారిశుద్ధ్య పనివారల సంఘం (వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ అనుబంధ సంస్థ) క్యాలెండర్‌ను తన చాంబర్‌లో శనివారం మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యల్ని తన దృష్టికి తెస్తే, వెంటనే వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యుడు బోడపాటి కిశోర్ కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు గుత్తికొండ అంజిరెడ్డి, కాల్వపల్లి సాంబిరెడ్డి, యూనియన్ నాయకులు బత్తుల మరియన్న, భూపతి నాంచారయ్య, భజంత్రి రమణ, భీమవరపు రమణ, భజంత్రి శ్రీను, భూపతి సాంబశివరావు, గాలిముత్తం ఆదాం, పెదాల కృష్ణ, నక్కా నాంచారయ్య పాల్గొన్నారు.

అనధికార చీటీల నిర్వహణతో కుచ్చుటోపీ

బాధితుడి ఫిర్యాదుతో అరెస్ట్

మంగళగిరి: అనధికారికంగా చీటీలు వేసి పాటదారులకు నగదు చెల్లించకపోవడంతో బాధితుల ఫిర్యాదుతో గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గ టీడీపీ మహిళా అధ్యక్షురాలు, మార్కెట్ యార్డు మాజీ చైర్‌పర్సన్ ఆరుద్ర భూలక్ష్మి మరిది ఆరుద్ర సత్యంను పోలీసులు శుక్రవారం రాత్రి అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బాధితుడు శ్రీకాకుళం వీరబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరబాబు సత్యం వద్ద రూ.20 లక్షల చీటీ వేయగా పాడిన అనంతరం నాలుగు సంవత్సరాలైనా ఇప్పటి వరకు మరో రూ.6 లక్షలు చెల్లించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సత్యంను అరెస్టు చేసిన పోలీసులు కోర్టులో హాజరుపర్చగా కోర్టు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన రూరల్ ఎస్‌ఐ

మంగళగిరి: రూరల్ ఎస్‌ఐగా రమేష్‌బాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లా పొన్నలూరు ఎస్‌ఐగా విధులు నిర్వహించిన రమేష్‌బాబు మంగళగిరి రూరల్ ఎస్‌ఐగా బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు రూరల్ ఎస్‌ఐగా విధులు నిర్వర్తించిన ఎస్‌ఐ మహేష్‌ను ప్రకాశం జిల్లాకు అధికారులు బదిలీ చేశారు. ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన మహేష్‌బాబుకు పలువురు సిబ్బంది అభినందనలు తెలిపారు.

నేటి నుంచి శ్రీ త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు

పాత గుంటూరు: లక్ష్మీపురంలోని శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో 8వ తేదీ నుంచి 12 వరకు 176వ సద్గురు శ్రీ త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ సహాయ కార్యదర్శులు ఎస్. గిరిజాశంకర్, వి. కృష్ణ కిశోర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 8న ఉదయం 9 గంటలకు ప్రారంభ సభ, సాయంత్రం 6 గంటల నుంచి గాత్ర కచేరి, 9న వయోలిన్ కచేరి, 10న గాత్ర కచేరి, 11న గాత్ర కచేరి, 12న ఉదయం శ్రీ త్యాగరాజ స్వామికి అభిషేకార్చనలు, పంచరత్న సేవ విశేషంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం ఆంజనేయ ఉత్సవంతో కార్యక్రమాలు ముగుస్తాయని తెలిపారు. కార్యక్రమాల్లో కళాకారులు, సంగీతాభిమానులు పాల్గొనాలని వారు కోరారు.

పాటిబండ్ల సీతారామయ్య పాఠశాలకు స్వచ్ఛ పురస్కారం

గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల గుంటూరు నగరపాలక సంస్థ నుంచి స్వచ్ఛ పాఠశాల పురస్కారాన్ని అందుకుంది. స్వచ్ఛ సర్వేక్షణ్–2023లో భాగంగా నిర్వహించిన పోటీల్లో గుంటూరు నగరస్థాయిలో తమ పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచినందుకు గాను మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు, కమిషనర్ చేకూరి కీర్తి నుంచి శనివారం అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ పురస్కారాన్ని అందుకున్నారని కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ చెప్పారు. పాఠశాలను ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్దడంతో పాటు పిల్లలకు అవసరమైన ఇండోర్, అవుట్‌డోర్ ఆటల్ని నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేయడం, క్రికెట్, బాస్కెట్ బాల్ కోర్టు, ఎన్‌సీసీ వంటి సదుపాయాల్ని కల్పించడం ద్వారా నగరపాలక సంస్థ నుంచి ప్రశంసలు అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బోధన, బోధనేతర సిబ్బందిని పాఠశాల కమిటీ అధ్యక్షుడు దేవినేని మల్లికార్జునరావు, సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు అభినందించారు.

పాఠశాల ఎదుట తల్లిదండ్రుల ధర్నా



ధర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు, నాయకులు

తెనాలిఅర్బన్: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులను విధుల నుంచి తొలగించాలని 1వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ గెడ్డేటి సురేంద్ర ఆధ్వర్యంలో పేరెంట్స్ కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు శనివారం ఐతానగర్‌లోని ఎన్ఎస్ఎస్ఎంహెచ్ స్కూల్ ఎదుట ధర్నా చేశారు. సమ్మిట్ పరీక్షలను విద్యార్థులు బహిష్కరించి ధర్నాలో కూర్చున్నారు. పాఠశాలలో ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయురాలు విజయలక్ష్మిని విధులు నుంచి తొలగించాలని, హిందీ ఉపాధ్యాయురాలు నీలిమ ప్రశాంతిని జిల్లా నుంచి బదిలీ చేయాలని వారు

విచారణ జరిపిన డీఈవో శైలజ

కోరారు. డీఈవో శైలజ తెనాలి వచ్చి పరిశీలించి, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడంతో ఆమె మధ్యాహ్నం తెనాలి వచ్చారు. ఉపాధ్యాయులను, విద్యార్థులను, తల్లిదండ్రులను, పేరెంట్స్ కమిటీ సభ్యులను విచారించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో నిర్మల, ఎంఈవో లక్ష్మీనారాయణ, ఎమ్మార్పీఎస్ నాయకులు, పూర్వ విద్యార్థులు, పలువురు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

మానసిక వికాసంపై అవగాహన

మేడికొండూరు: ప్రతి విద్యార్థి భావోద్వేగాలను నియంత్రణలో పెట్టుకుంటే జీవితంలో మంచి ఉన్నత స్థానం సాధించేలా మంచి లక్ష్యం కలిగి ఉండాలని అమెరికాకు చెందిన హెచ్‌బీ కంపెనీ వైస్‌ప్రెసిడెంట్ కె.శ్రీదేవి అన్నారు. మండలంలోని విశదల అడ్డరోడ్డు వద్ద గల ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం విద్యార్థులకు మానసిక వికాసంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీదేవి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో యువత భావోద్వేగాల నియంత్రణలో ఉంచుకోవాలన్నారు. మనస్సులో పుట్టే ప్రతి ఆలోచనను ఒక్క క్షణం ఆలోచించి మంచి చెడులతో పరిశీలన చేసుకుని మంచి ఆలోచన వైపు నడవాలన్నారు. ఎలాంటి క్లిష్ట పరిస్థితులైనా ఎదుర్కొని మనోధైర్యాన్ని ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలన్నారు. సమస్యలు మానవ జీవితంలో ఒక భాగమని, పరిస్థితిని బట్టి ఆలోచనా విధానం మార్చుకుంటూ ఉన్నతంగా ఉండే విధానాన్ని ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలన్నారు. విద్యార్థి దశలో ఉండే ప్రతి



హెచ్‌బీ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ శ్రీదేవిని సన్మానిస్తున్న వైస్ ప్రిన్సిపాల్ శ్రీహరిరావు

సమయం విలువైందన్నారు. వాటిని గుర్తించాలన్నారు. ప్రతి విద్యార్థి టెన్షన్, రిలీఫ్‌కు ధ్యానం, యోగ క్రమం తప్పకుండా చేయాలన్నారు. మానసిక ధైర్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీహరిరావు, ఏఓ బి.సీతారామయ్య, పి.రవికుమార్, డాక్టర్ చంద్రమౌళి, రెహమాన్, పలువురు అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సందడిగా ముందస్తు సంక్రాంతి సంబరాలు

గుంటూరు ఎడ్యుకేషన్: తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు పండుగలు ప్రతీకగా నిలుస్తాయని ఏఎన్‌యూ విశ్రాంత రిజిస్ట్రార్ రావెల సాంబశివరావు పేర్కొన్నారు. జేకేసీ కళాశాల రోడ్డులోని ఆర్వీఆర్ బీఈడీ కళాశాలలో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాల్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సాంబశివరావు మాట్లాడుతూ తెలుగు ప్రజలు జరుపుకునే అతిపెద్ద పండుగ సంక్రాంతి అని పేర్కొన్నారు. కళాశాల కరస్పాండెంట్ గద్దె మంగయ్య మాట్లాడుతూ తెలుగు పండుగల విశిష్టతలు, భారత దేశ సంస్కృతి, సంప్రదాయాల విలువల్ని తెలుసుకొని వాటిని పాటించడం ఎంతో అవసరమని ఆయన విద్యార్థినులకు సూచించారు. ప్రిన్సిపాల్ మోటూరి రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని నెలకొల్పేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు సంప్రదాయ వస్త్రాలను ధరించి సంగీతం, జానపద నృత్యాలు ప్రదర్శించారు. కోలాటాలు, భోగి మంటలతో ఆనందోత్సాహాల మధ్య కళాశాలలో పండుగ వాతావరణం నెలకొంది.



కళాశాల ప్రాంగణంలో భోగిమంట వద్ద విద్యార్థినుల కోలాటం

కేఎల్‌పీ స్కూల్లో సంబరాలు

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్లో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణాన్ని రంగవల్లులు, పచ్చని తోరణాలు, అందమైన రంగవల్లులతో తీర్చిదిద్దారు. ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు అచ్చ తెలుగు వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ తెలుగు వారు జరుపుకునే పండుల్లో సంక్రాంతికి ప్రత్యేక స్థానముందని తెలిపారు. పాఠశాల ప్రాంగణంలో భోగి మంటలు వేసి, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు రాయపాటి శ్రీనివాస్, పాఠశాల వ్యవస్థాపకుడు కె. బసవపున్నయ్య, పాఠశాల ప్రిన్సిపాల్ వై. రథినీచౌదరి, ఏవో కె. వెంకట్రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

నెహ్రూనగర్: పింఛన్ పెంపుతో అవ్వాతాతలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతన సంవత్సర కానుక అందించారని 34వ డివిజన్ కార్పొరేటర్ బూసి రాజలత పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని 122వ సచివాలయంలో శనివారం పింఛన్‌దారులతో కలసి సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నారని కొనియాడారు. డివిజన్ పరిధిలో 1100 పైగా పింఛన్లు ఉండగా, కొత్తగా మరో 50 మంజూరయ్యాయని ఆమె చెప్పారు.



నేడు వాసవీ మాత ఆలయంలో శిలాఫలకం ఆవిష్కరణ

పాత గుంటూరు: గంటలమ్మ చెట్టు వీధిలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కొత్తూరి వెంకట నరసింహారావు ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా క్రేన్ సంస్థల అధినేత జి.వి.ఎస్.ఎల్. కాంతారావు పాల్గొని శిలాఫలకాన్ని ఆవిష్కరించి, 108 ముత్తయిదువులకు పసుపుకుంకుమ అందిస్తారని పేర్కొన్నారు. భక్తులు పాల్గొనాలని నరసింహారావు కోరారు.